క్లుప్తంగా

పాదయాత్ర పోస్టర్ విడుదల



ధరూరు: నడిగడ్డ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి ప్రారంభించనున్న ఆత్మగౌరవ పాదయాత్ర వాల్ పోస్టర్‌ను ధరూరులో విడుదల చేశారు. ఆదివారం నడిగడ్డ హక్కుల పోరాట సమితి కార్యాలయంలో మండల అధ్యక్షుడు గోవిందు మండల నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రజలను చైతన్యం చేసేందుకు పాదయాత్ర చేస్తున్నట్లు తెలిపారు. 21 రోజులు 400 కిలోమీటర్ల పాటు పాదయాత్ర కొనసాగుతుందన్నారు. పాదయాత్రలో ప్రజలు స్వచ్ఛందంగా కలిసి వస్తారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు జమ్మన్న, పరశురాముడు, ఆంజనేయులు, రాము, శాంతన్న, కృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా పాఠశాల గోడలు



మానవపాడు: కార్పొరేట్‌కు దీటుగా విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలలకు రూ.లక్షలు ఖర్చు చేస్తోంది. మానవపాడు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో.. గతంలో నిర్మించిన పాఠశాల నిర్మాణాలు నాణ్యత లేక పాఠశాల గోడలు దెబ్బతిని పెచ్చులు ఊడి రాలి కిందపడుతున్నాయి. పాఠశాలలో ప్రార్థన సమయంలో తమపై పడుతున్నాయని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రోడ్డు మరమ్మతు చేపట్టండి



మల్దకల్: మండలంలోని అమరవాయి–బిజ్వారం గ్రామాల మధ్యన బీటీ రోడ్డుపై ఏర్పడిన గుంతలకు మరమ్మతు చేయాలని వాహనదారులు గోవిందు, మోహన్, బీసన్న తదితరులు కోరుతున్నారు. 15 ఏళ్ల కిందట వేసిన బీటీ రోడ్డు గుంతలమయంగా మారిందని, దీంతో ప్రతి నిత్యం వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపై ఏర్పడిన గుంతలకు మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

మంత్రిని కలిసిన తండావాసులు

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపూర్ మండలంలోని కుంటివానితండా, ఆర్యతండాలకు చెందిన గిరిజనులు ఆదివారం మంత్రి నిరంజన్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా నెలకొన్న సమస్యలను వివరించడంతో పాటు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. తండాల్లో నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని తెలిపారు. అభివృద్ధి కోసం అవసరమున్నా నిధులు మంజూరు చేయిస్తానని, ఇదివరకే బీటీ రోడ్డు మంజూరైనట్టు తనే స్వయంగా ఈనెల 21న వచ్చి శంకుస్థాపన చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో తాటిపాముల సర్పంచ్ సత్యంయాదవ్, నవీన్‌రెడ్డి, చక్రవర్తి యాదవ్, బాల్‌రాం, లోక్యానాయక్, శివరాజు, అంజి, తిరుపతి, సేవ్యా, బుడ్డ బుచ్చన్న, మల్లేష్ తదితరులు ఉన్నారు.

'చలో ఢిల్లీ' విజయవంతం చేయండి

వనపర్తి క్రైం: కార్మిక చట్టాల పరిరక్షణ కోసం ఏప్రిల్ 5న చేపట్టే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని భవన నిర్మాణ కార్మికులు విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర కార్యదర్శి రాజు పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. భవన నిర్మాణంలో వాడే ముడి సరుకుల ధరలను నియంత్రించాలని, అసెంబ్లీలో ప్రభుత్వం ప్రకటించిన మోటార్ సైకిళ్లను నిర్మాణ కార్మికులకు వెంటనే ఇవ్వాలన్నారు. వెల్ఫేర్ బోర్డులో పేరు నమోదుకు రేషన్‌కార్డు తప్పకుండా ఉండాలనే నిబంధనలను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

కూలీలకు చేయూత



దాసర్‌పల్లిలో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు

- జోరుగా సాగుతున్న ఉపాధిహామీ పనులు
- పర్యవేక్షిస్తున్న ఉన్నతాధికారులు

మల్దకల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు గ్రామాల్లో జోరుగా సాగుతున్నాయి. ఉపాధి పనులకు గ్రామీణులు ఆసక్తి చూపుతున్నారు. వేసవిదృష్ట్యా కూలీలు ఉపాధి పనులకే మొగ్గుచూపుతున్నారు. జాబ్‌కార్డులు ఉన్న కూలీలకు ఉపాధి హామీ పనులపై అధికారులు అవగాహన కల్పించడంతో యువకులు అధికసంఖ్యలో తరలివస్తున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో పొలం పనులు పూర్తి కావడంతో కూలీలు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో ఉపాధిహామీ బాట పట్టారు. దీంతో పనులు చేస్తున్న ప్రదేశాల్లో కూలీలతో జాతరను తలపిస్తోంది.

గద్వాల నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో మొత్తం 68,157 జాబ్‌కార్డులు ఉన్నాయి. జాబ్ కార్డు ఉన్న కూలీలు ప్రతి రోజూ పనుల్లో నిమగ్నమవుతున్నారు. మల్దకల్ మండలంలో ప్రస్తుతం 17 గ్రామపంచాయతీల్లో ఉపాధి హామీ పనులు కొనసాగుతున్నాయి. అలాగే మండల కేంద్రాల్లో రోజుకు 50 నుంచి 100 వరకు, గ్రామాల్లో 30 నుంచి 50 మంది వరకు కూలీలు పనులకు తరలివెళ్తున్నారు. ఆయా గ్రామాల్లో కూలీలు ముళ్లపొదల తొలగింపు, పొలాల చదును, చెరువులు, కుంటల పూడికతీత, పంట కాల్వల్లో పేరుకున్న మట్టిని తొలగించడం, వ్యవసాయ బావుల్లో పూడికతీత పనులు, పశువుల షెడ్ల నిర్మాణం, పంట పొలాలు, ఆవాస గ్రామాలకు మట్టి రోడ్ల నిర్మాణం వంటి పనులు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో దాదాపు యాసంగి పనులు పూర్తయ్యాయి. దీంతో గ్రామాల్లో వ్యవసాయ పనులు లేక కూలీలు పనులు చేస్తున్నారు.

కుటుంబానికి ఆసరా



గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులతో కుటుంబానికి ఎంతో ఆసరాగా ఉంటుంది. గ్రామంలో జాబ్‌కార్డులున్న కూలీలందరు పనులకు వెళ్తున్నారు. ప్రతి రోజు ఉపాధి దొరుకుతోంది. వచ్చిన డబ్బులతో కుటుంబాన్ని పోషించుకుంటున్నా.

రాఘవేంద్ర, బూడిదపాడు

ప్రతిరోజూ కూలి దొరుకుతుంది



గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి పనులకు రోజూ కుటుంబ సభ్యులతో కలిసి వెళ్తున్నా. వేసవి కావడంతో ఉదయం ఉపాధి కూలీ పనులు చేస్తూ మధ్యాహ్నం నుంచి ఇతర పనులు చేసుకుంటున్నా.

– వీరేష్, అమరవాయి

సద్వినియోగం చేసుకోవాలి



ఉపాధిహామీ పనులపై మండలంలోని అన్ని గ్రామాల ప్రజలకు ఇప్పటికే అవగాహన కల్పించాం. గ్రామాల్లో దాదాపు యాసంగి పనులు పూర్తి అయ్యాయి. జాబ్ కార్డులు ఉన్న కూలీలు, యువత, మహిళలు ఉపాధి హామీ పనులు సద్వినియోగం చేసుకోవాలి.

-కృష్ణయ్య, ఎంపీడీఓ, మల్దకల్

'రిజర్వేషన్ల ఉనికికి ప్రమాదం'



అలంపూర్ సమావేశంలో మాట్లాడుతున్న కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు

అలంపూర్: దేశంలో రిజర్వేషన్ల ఉనికికి ప్రమాదం పొంచి ఉందని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు అన్నారు. పట్టణంలోని కేవీపీఎస్ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశానికి కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు, జిల్లా అధ్యక్షుడు మారెన్న హాజరై మాట్లాడారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులపై దాడులు పెరిగాయన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని దేశ వ్యాప్తంగా అమలు చేయాలన్నారు. దళితులపై దాడులు అరికట్టడానికి ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. స్టేషన్ బెయిల్ ఇవ్వకుండా చూడాలన్నారు. రాజ్యాంగ రిజర్వేషన్లు రద్దు చేయడానికి ఆర్ఎస్ఎస్, బీజేపీలు ప్రయత్నాలు చేస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు అమ్మేస్తోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయడంతో రిజర్వేషన్లకు ముప్పు వాటిల్లుతుందన్నారు. దేశంలో తొమ్మిదేళ్లలో దళితులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ.. ఈ నెల 14న హైదరాబాద్‌లోని ఇందిర పార్కు వద్ద మహాధర్నా చేపడుతున్నట్లు తెలియజేశారు. దళితులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు పరంజ్యోతి, జిల్లా కమిటీ సభ్యులు విజయ్‌కుమార్, సవరన్న, ఆంజనేయులు, వెంకటస్వామి, కర్రెప్ప, రాజు, మహేష్, నాగరాజు, యువరాజు, దినకర్ తదితరులు ఉన్నారు.

ధ్యానం దినచర్యగా మార్చుకోవాలి



బొంకూరులో ధ్యానంపై అవగాహన కల్పిస్తున్న గుండం తిరుపతయ్య

ఉండవెల్లి: ధ్యానం చేయడం దినచర్యలో ఒక భాగంగా మార్చుకోవాలని పిరమిడ్ స్పిరీచ్యువల్ సొసైటీ ధ్యాన ప్రచారకర్తలు బంగ్లా ఆంజనేయరెడ్డి, అమ్మపల్లి బాలకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని బొంకూరు, మెన్నిపాడు, కలుగోట్ల గ్రామాల్లోని ప్రజలకు ధ్యానం, ఆహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మాంసాహారం కంటే శాఖాహారంలో విటమిన్లు, శక్తి ఎక్కువగా ఉంటుందన్నారు. మాంసాహారం తీసుకోవడంతో ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. ధ్యానంతో సృజనాత్మకత, శక్తి పెరుగుతుందని, నిత్య జీవితంలో ఎదుర్కొంటున్న అనేక ఒత్తిడిని ధ్యాన సాధనతో దూరం చేసుకోవచ్చని పేర్కొన్నారు. తలనొప్పి నుంచి క్యాన్సర్ వంటి బరువులు తగ్గుతాయని తెలిపారు. కార్యక్రమంలో పిరమిడ్ సంస్థ సభ్యులు గుండం తిరుపతయ్య, సంగు వరలక్ష్మి, గుండం శైలజ, వెంకటలక్ష్మి, స్వప్న, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ యువజన సంఘం ఎన్నిక



మల్దకల్: మండల కేంద్రంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన మండల కమిటీని ఆదివారం జిల్లా నాయకులు మాచర్ల ప్రకాష్, ఆంజనేయుల ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ప్రకాష్, ఉపాధ్యక్షుడిగా రాజేష్, రుబెన్ ప్రధాన కార్యదర్శిగా ప్రకాష్, ప్రచార కార్యదర్శిగా స్టీఫెన్, సాగర్ సంఘం సభ్యులుగా ఆనందరాజు, విజయ్‌కుమార్, ప్రసాద్, నవీన్, జయన్న, మార్క్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సుధాకర్, లక్ష్మణ్, పరశురాముడు, వేమన్న, దేవప్ప తదితరులు పాల్గొన్నారు.

ముందురోజే మద్యం తరలింపు!

రాజోళి: ఎమ్మెల్సీ ఎన్నిక మద్యం వ్యాపారులకు మరింత ఆదాయనిచ్చింది. రెండు రోజుల్లో రూ.లక్షల మద్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలించినట్లు సమాచారం. మండలంలో రెండే వైన్ షాపులుండగా.. రెండు షాపుల నుంచి ఇదే అదునుగా బ్లాక్ మార్కెట్‌లో మద్యం విక్రయాలు భారీగా జరిగాయి. ఒక్క రాజోళి మండలమే కాకుండా, వడ్డేపల్లి, మానవపాడు, ఉండవెల్లి, అయిజ తదితర మండలాల్లోని వైన్ షాపులు బంద్ కావడానికి ముందే గ్రామాల్లోని బెల్ట్ షాపులతో సహా, మండల కేంద్రాల్లో ప్రత్యేంగా బ్లాక్‌లో అమ్మేందుకు బారీగా మందును బయటకు తరలించినట్లు తెలస్తోంది. రాజోళి మండలంలోని ఒక్క మాన్‌దొడ్డి వైన్ షాపు నుంచే గ్రామాల్లోని బెల్ట్ షాపులకు రూ.3 లక్షల సరుకు, అదనంగా రూ.2 లక్షల సరుకు బయటకు తరలించారంటే మిగతా అన్ని చోట్ల కలిసి ఎంతమేర బ్లాక్ దందా నడిచిందో తెలుసుకోవచ్చు. ఈ క్రమంలో కొన్ని షాపుల్లో రెగ్యులర్‌గా వచ్చే మద్యం బాబులకు కూడా వారికి కావాల్సిన బ్రాండ్ అమ్మకుండా స్టాక్ లేదని చెప్పి ఇతర మందును చేతిలో పెట్టి పంపారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇంత జరుగుతున్నా.. నిబంధనలకు విరుద్ధంగా మాన్‌దొడ్డిలో షాపు తెరిచారని, పత్రికల్లో కథనాలు వచ్చినా.. సంబంధిత శాఖ అధికారులు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

ఉమ్రా యాత్రికులకు సన్మానం

ఆత్మకూర్: ఉమ్రా యాత్రకు వెళ్తున్న వారు అక్కడ ప్రపంచ శాంతికోసం ప్రార్థించాలని మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి తెలిపారు. పట్టణానికి చెందిన పలువురు ఉమ్రా యాతిరకులను ఈ సందర్భంగా శాలువా, పూలమాలతో సత్కరించారు. గాయత్రి పాల్గొన్నారు.



కష్టాలకు నిలయాలు



మానవపాడులో లీకేజీ అవుతున్న మిషన్‌భగీరథ నీరు



వెలగని విద్యుత్ బల్బు



పనిచేయని సీసీ కెమెరాలు

- పరీక్షల సమయంలో కస్తూర్బాలో వెలగని విద్యుత్ దీపాలు
- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు

మానవపాడు: గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమికోన్నత విద్య స్థాయిలో మగ పిల్లల కంటే బాలికల విద్య తక్కువగా ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకొని బాలికల విద్యను ప్రోత్సహించాలనే లక్ష్యంతో హాస్టల్ వసతి కల్పిస్తూ.. కస్తూర్బా గాంధీ విద్యాలయాలను ఏర్పాటు చేశారు. లక్ష్యం బాగానే ఉన్నా.. నిర్వహణ మాత్రం అస్తవ్యస్తంగా తయారైంది. విద్యాలయాలు కష్టాలకు నిలయాలుగా మారాయి. 'పది' విద్యార్థులకు వార్షిక పరీక్షలు దగ్గర పడుతున్నా.. విద్యుత్ దీపాలు వెలగడం లేదు. మండలంలోని మానవపాడు కస్తూర్బా పాఠశాలలో మౌలిక వసతుల కల్పన లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాలలో 6 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వాటి పని తీరు సరిగా లేదు. విద్యుత్ వైర్లు కిందకు వేళాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. పాఠశాల ఆవరణ చుట్టూ పిచ్చిగడ్డి మొలిచింది. మిషన్‌భగీరథ నీరు లీకేజీ ఏర్పడుతోంది. పాఠశాల ఆవరణ బయట రాత్రి సమయంలో విద్యుత్ సమస్యలు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో కూడా విద్యుత్ బల్బులు వెలగడంలేదని వాపోయారు. పదో తరగతి వార్షిక పరీక్షలు దగ్గర పడుతున్నాయని, విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం

మండలంలోని కస్తూర్బా పాఠశాలలోని సమస్యలు మా దృష్టికి రాలేదు. త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తాం. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అని చర్యలు తీసుకుంటాం.

– శివప్రసాద్, ఎంఈఓ, మానవపాడు

మైనార్టీల సంక్షేమానికి కృషి



విద్యార్థులను సన్మానించి శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల రూరల్: ముస్లిం మైనార్టీల సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేశారని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని మదర్సా ఏ ఇస్లామియా అరేబియా బైతులలుమ్‌లో హిబ్స్ హాఫీజ్‌లుగా విద్యను పూర్తి చేసిన విద్యార్థులను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వాలన్నీ ముస్లీంమైనార్టీలను కేవలం ఓటు బ్యాంకుగానే పరిగణించే వారని ప్రస్తుతం సీఎం కేసీఆర్ ముస్లింల సంక్షేమం కోసం పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఉస్మాన్ మౌలానా, అబ్బాస్ మౌలానా, హఫీజ్ అన్సార్, మసీద్ కమిటీ సభ్యులు మాలీం షబ్బీర్, మాలీం వాజిద్, మాలీం ఖయ్యూం, ఎంపీపీ విజయ్, మున్సిపల్ వైస్‌చైర్మన్ బాబర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి



వడ్డేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చేరుకున్న బ్యాలెట్ బాక్సుల వద్ద అధికారులు



ఉండవెల్లి పాఠశాలలో పోలింగ్ బూత్‌లో బ్యాలెట్‌లను పరిశీలిస్తున్న తహసీల్దార్ వీరభద్రప్ప

రాజోళి: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ జోషి శ్రీనివాస్ శర్మ తెలిపారు. మండల కేంద్రంలోని రాజోళిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఎన్నికకు సంబంధించిన పలు ఏర్పాట్లను ఎస్ఐ కుర్మయ్యతో కలిసి ఆదివారం పరిశీలించారు. సోమవారం ఉదయం 8 గంటల నుంచి 4 గంటల వరకు కొనసాగే ఎన్నికల్లో 24 ఓట్లు ఉన్నట్లు, నిర్ణీత సమయంలో ఓటర్లు తమ ఓటును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో శాంతిగనర్ ఎస్ఐ శ్రీనివాస్ నాయక్, ఆర్ఐ శ్రీనివాసులు, మహేంద్ర, తులసి తదితరులు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ బూత్–43ను తహసీల్దార్ వీరభద్రప్ప, ఎంపీడీఓ ఆంజనేయ రెడ్డి పరిశీలించారు. ఆదివారం పోలింగ్ బూత్‌ను అధికారులు పరిశీలించి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలని వీఆర్ఏలకు, పంచాయతీ కార్మికులకు సూచించారు. రెండు బ్యాలెట్ బాక్సులను పోలీసు సిబ్బంది తీసుకుని వచ్చింది. వాటిని భద్రంగా పాఠశాల గదులకు చేర్చారు. అనంతరం పోలీస్ సిబ్బందికి ఎస్ఐ బాల్‌రాజు పలు సూచనలు సలహాలు చేశారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ లక్ష్మి రెడ్డి, ఏఎస్ఐ అయ్యన్న, ఆర్ఐ సుచిత్ర పాల్గొన్నారు.

గట్టు: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీఓ చెన్నయ్య తెలిపారు. గట్టులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. గట్టు మండలంలో 12 ఓట్లు ఉండగా, పోలింగ్ కేంద్రంలో సుమారు 15 మంది సిబ్బందిని నియమించారు. పోలీసులు కూడా భద్రతను ఏర్పాటు చేశారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తహసీల్దార్ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆదివారం మండలంలో ఎన్నికలు నిర్వహించే 38వ పోలింగ్ స్టేషన్‌ను ఆయన సందర్శించి వసతులు పరిశీలించారు. పోలింగ్ స్టేషన్‌లో మొత్తం 54 మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. ఆయన వెంట ఎంపీడీఓ రాఘవ, ఆర్ఐ సుదర్శన్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

పోలింగ్ స్టేషన్‌కు చేరుకున్న ఎన్నికల సామగ్రి

శాంతినగర్: ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన పోలింగ్ సామగ్రి వడ్డేపల్లికి ఆదివారం చేరుకుంది. వడ్డేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ జయరాములు తెలిపారు. వడ్డేపల్లి పోలింగ్ స్టేషన్‌లో 45 మంది ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకుంటారని పేర్కొన్నారు.

ధరూరు: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మండలంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ నరేష్ తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ధరూరు, కేటీదొడ్డి మండలాలకు సెంటర్‌ను ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. 40 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన



మాట్లాడుతున్న పీఏసీఎస్ ప్రసిడెంట్ మధుసూదన్ రెడ్డి

అయిజ: మండల కేంద్రంలోని మార్కెట్ సబ్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన పప్పుశనగ కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం సింగిల్ విండో ప్రసిడెంట్ మధుసూదన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో 25 వేల క్వింటాళ్ల కొనుగోళ్లకు అనుమతి ఉండడంతో మొత్తం కొనుగోలు చేశామని తెలిపారు. జిల్లాలో ఇంకా 67 శాతం పంట రైతుల వద్ద ఉందని తెలిపారు. మొత్తం పంటను కొనుగోలు చేయాలని సంబంధిత అధికారులను కోరామని, అనుమతులు వచ్చిన వెంటనే కొనుగోలు చేస్తామన్నారు.

శ్రీశైలానికి పాదయాత్రగా భక్తులు



ఉండవెల్లి ఆలయంలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

ఉండవెల్లి: కర్ణాటక రాష్ట్రం నుంచి తెలంగాణ మీదుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని శ్రీశైలానికి భక్తులు పాదయాత్రగా అధిక సంఖ్యలో వెళ్తున్నారు. భక్తులు భక్తిగీతాలతో భజనలు చేసుకుంటూ మండుటెండలో ప్రయాణిస్తున్నారు. ఉగాది పర్వదినానికి శ్రీశైలానికి చేరుతామని భక్తులు తెలియజేస్తున్నారు.

భక్తులకు అన్నదానం..

మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్లే భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలోని అయ్యప్ప దీక్షా సేవ సమితి ఆధ్వర్యంలో ఆలయ ధర్మకర్త దామోదర్ రెడ్డి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సేద తీరడానికి ప్రత్యేక ఏర్పాటు నిర్వహించారు.

జాతీయ రహదారిపై తప్పిన ప్రమాదం

మానవపాడు: జాతీయ రహదారి–44పై హైదరాబాద్ వైపు నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న డీసీఎంను లారీ ఢీ కొట్టిన సంఘటన ఆదివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. జాతీయ రహదారిపై డీసీఎం పైపులను తీసుకొని హైదరాబాద్ వైపు నుంచి కర్నూల్ వెళ్తుండగా.. అదేదారిలో ముంబయి నుంచి చెన్నై వెళ్తున్న లారీ జాతీయ రహదారిపై జల్లాపురం శివారు ప్రాంతంలో ముందు వెళ్తున్న డీసీఎం వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. ప్రమాదవశాత్తు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. లారీ డ్రైవర్ అనికేత్‌కు, డీసీఎం డ్రైవర్ రాకేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటనపై పోలీసులను వివరణ కోరగా ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలియజేశారు.